విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, మాజీ శాసన మండలి సభ్యులు జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సును వెంటనే అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, మాజీ శాసన మండలి సభ్యులు జల్లి విల్సన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కొడవలూరు మండలంలోని యల్లయ్యపాలెం గ్రామంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా శ్రమజీవుల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ భూ పోరాటాలు చేసి హక్కులను సాధించించింది నెల్లూరు జిల్లా అని , ఉద్యమాలకు పెట్టింది పేరు నెల్లూరు అని ఆయన కొనియాడారు. గుజ్జుల యలమందరెడ్డి హయాంలోనే వేంకటగిరి జమిందారులకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేసి హక్కులను సాధించుకున్నామని ఆయన తెలిపారు. వైయస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాతే ఒక పక్క రియల్ ఎస్టేట్, కార్పొరేట్ వ్యవస్థలకు ప్రభుత్వం దళారీగా మారి పేదవానికి భూమి దక్కే పరిస్థితులు కనబడడం లేదన్నారు. పేదవానికి భూములు ఉన్నాయని, భూములు వున్నా అవి పంచడానికి రెవెన్యూ యంత్రాంగానికి పక్షవాతం వచ్చిందని ఆయన తెలిపారు. వైయస్ జగన్ ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి చట్టాలను చెత్తబుట్టలో వేస్తున్నాడని భూ హక్కు చట్టాలు అమలు చేసి పేదలకు భూములు పంపిణీ చేయాలని విల్సన్ డిమాండు చేశారు. పేదవాడు పక్క ఇల్లు నిర్మించుకోవాలంటే సిమెంట్, కమ్మి, ఇసుక, కంకర ఉచితంగా ఇచ్చి లబ్ధిదారునికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని అలా ఇస్తేనే ఇంటి యజమాని అప్పులు పాలు కాకుండా ఉంటాడని అధికారంలో వున్న ప్రభుత్వానికి పలు దాఫాలుగా విజ్ఞప్తి చేసినా చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లుగా ఉందని ఆయన విమర్శించారు. 1978 సంవత్సరంలో స్వర్ణ వేమయ్య, అప్పటి యంఎల్ సి భట్టు సుబ్బారామయ్య గృహనిర్మాణ లభిదారునికి 4వేల రూపాయలు ఇవ్వాలని చెప్పారన్నారు. ఎర్రజెండాల పార్టీల అండతో మళ్లీ భూ పోరాటాలు చేయాలని దేశంలోనే నెల్లూరులోనే సెజ్‌లు ఎక్కువగా ఉన్నాయని పేదల నుంచి భూములు లాక్కొని సెజ్ లకు అప్పగించారని మన ఊరిలో వున్న భూములకు మనమే రాజులమని ఆయన తెలిపారు. అంతకు ముందు వ్యవసాయ కార్మిక సంఘం జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అవుల శేఖర్, రాష్ట్ర నాయకులు వెంకట్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది ఎకరాలు పెత్తందారుల పలుకుబడిలో దౌర్జన్యంగా అనుభవిస్తున్నారన్నారు.

అయితే ప్రభుత్వం వారి జోలికి మాత్రం వెళ్లడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కోనేరు రంగారావు సిఫారసులను అమలు చేయాలని నవరత్నాలలో వ్యవసాయ కార్మికుల డిమాండ్ల ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి దుర్గబాబు, నంది పోగు రమణయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాలకొండయ్య, షాన్ వాజ్, ఆనందు, సిపిఐ కోవూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ మున్వర్, వ్యవసాయ సంఘం నాయకులు యస్ కె ఫాతిమా, యస్దాని ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి జి విజయకుమార్, సయ్యద్ ఖలీల్, భూలోకం కాంతారావు, మండల సిపిఐ కార్యదర్శి యన్ రమేష్ బాబు, సిపిఐ నెల్లూరు జిల్లా సమితి సభ్యులు నాగేంద్ర, ఆదినారాయణ, చల్ల నరసయ్య, పముజుల హరి, జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యదర్శి ముక్తియార్ , ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నాలతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు, తదితరులు ఈ మహాసభలో పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, స్పందన వేదిక రద్దు

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగర పాలక సంస్థ లో ప్రతీ సోమవారం నిర్వ హించే డయల్ యువ ర్ కమిషనర్ , స్పంద న వేదికలను ఈ నెల 24వ తేదీ న రద్దు చేస్తున్నట్లు కమిషనర్ వికాస్ మర్మత్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నగర పాల క సంస్థ కౌన్సిల్ సమావేశం జరుగుతున్న నేపథ్యంలో స్పందన వేదికను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసా య కార్మిక సంఘం జిల్లా మహాసభ దృశ్యమాలిక

నెల్లూరులో చల్లబడిన వాతావరణం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:మేఘావృతమైన ఆకాశం భారీ వర్షంతోపాటు ఉరుములు మెరుపులతో కూడినటువంటి వాతావరణం ఒక్కసారిగా ఏర్పడింది. ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు కాసంత ఉపశమనం లభించింది. వాతావరణ మార్పులు వల్ల వాతావరణం చల్లబడింది. గత రెండు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో అనేక చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కానీ నెల్లూరు జిల్లా పై ఆ ప్రభావం తక్కువగా ఉన్నది, నిన్న కావలి మరికొన్ని చోట్ల తేలిక పాటి వర్షాలు కురిసినా నెల్లూరు నగరం జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఎండ మాత్రం తీవ్రస్థాయిలో తన ప్రభావం చూపింది. నేడు మధ్యాహ్నం వరకు ఎండ కాయగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి వర్షంనెల్లూరు జిల్లాలో ఎడతెరిపి లేకుండా విపరీతమైన ఈదురు గాలులు.భారీ వర్షంఇదే సమయంలో పిడుగులు పడే అవకాశం కూడా ఉన్నందున ప్రజలు ఒకపక్క వానతో అప్రమత్తం కాగా మరొకవైపు రైతులు మాత్రం ఈ వర్షం పంటలకు తీవ్రమైన నష్టం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఘనంగా శంకర్ స్కూల్ వార్షికోత్సవం ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: నగరంలోని ఉస్మాన్ సాహెబ్ పేట లో ఉన్న శంకర్ ఇంగ్లీష్ మీడి యం స్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వ హించారు. ఈ సంద ర్భంగా చిన్నారులు డ్యాన్సు లతో అద ర గొట్టారు. చిన్నారులు అందంగా ము స్తాబై కార్యక్రమానికి హాజర య్యారు. చిన్నారుల వేష ధారణ అందరిని ఆకట్టుకుంది.

గ్రీన్ హాండ్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - కావలి: వేసవికాల విపత్తు ఉపశమన చర్యలలో భాగంగా, స్వచ్ఛంద సంస్థల సహకారంతో బస్టాండ్ లోని ప్రయాణికులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు ఏపియస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గ్రీన్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా గ్రీన్ హాండ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు వేమూరి గాయత్రి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో గతంలో బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసామన్నారు. ఆర్టీసీ అధికారుల విజ్ఞప్తి మేరకు మజ్జిగ పంపిణీ చేసామని అన్నారు. వేసవి కాలంలో ప్రయాణికులు, పాద చారులు మంచినీటి సీసాను తమవద్ద ఎల్లపుడూ ఉంచుకోవాలన్నారు. వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమం లో వి.శ్రీలేఖ, విజయ, రజని, శ్రీలత, పద్మ, నిహాల్, నేహాశ్రీ, పద్మావతి, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కెవి ఆర్ బాబు, పాల్గొన్నారు.

టీడీపీ నేత విల్సన్ ను పరామర్శిస్తాం.. ఎవరు ఆపుతారో చూస్తాం..

- నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్

విశాలాంధ్ర- నెల్లూరు: కోవూరు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి పోలంరెడ్డి దినేష్ రెడ్డి ను కొడవలూరు పోలీసులు అరెస్ట్ చేసి, కొడవలూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. విషయం తెలుసుకున్న నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్చార్జి అబ్దుల్ అజీజ్ మాజీ శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తో కలిసి కొడవలూరు పోలీస్ స్టేషన్ కు చేరుకుని దినేష్ రెడ్డి నీ విడిపించుకుని తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వైసిపి నేతల అక్రమ మైనింగ్ ను బయట పెట్టినందుకు టీడీపీ నేత విల్సన్ పై వైసీపీ నేతలు దాడి చేశారని, ప్రతి పక్ష నేతలుగా జరుగుతున్న అన్యాయాలను అపడమే తమ పని అని తాము ఏమి జగన్ మోహన్ రెడ్డి కింద ఉద్యోగస్తులం కాదని, ప్రజల కోసం పోరాడేవారమని అన్నారు. ప్రజలకోసం ఎందాకైనా వెళ్తామని, వెనక్కి తగ్గిమని పేర్కొన్నారు. పోలీసుల వైసిపి నేతల చేతిలో ఆటబొమ్మలా మారిపోయారని, విల్సన్ పై దాడి చేసిన వారిని వదిలేసి, వాళ్ళంతట వాళ్ళే కోసుకుని వచ్చిన వారిని అడ్డం పెట్టుకుని కౌంటర్ కేసు పెట్టారని అన్నారు. కౌంటర్ కేసులకు కూడా ఎస్సీ ఎస్టీ లను వెతికి కౌంటర్ కేసు లు పెడతారని, పోలీసులకు దొంగ కేసులు పెట్టడం అలవాటు అయిపోయిందని నూతన ఎస్పీ ను కలిసినప్పుడు తాను లా అండ్ ఆర్డర్ ను గాడిలో పెడతనాని చెప్పారని, రేపు తాము ఎస్పీ కార్యాలయానికి వస్తున్నామని, అది కౌంటర్ కేసా కాదా అనేది తెలుసుకోవాలని అన్నారు.స్థానిక వైసీపీ నేత వీర చలపతి, మీడియా సమావేశాలు పెట్టీ గొంతు కొస్తానని చెపుతున్నారని, అధికారం శాశ్వతం అనుకుని విర్ర వీగుతున్నారని, ప్రజాస్వామ్యం లో గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలని ఏది పడితే అది మాట్లాడితే తిరిగి అవే మాటలు వస్తాయని మీరు గొంతు కోస్తు ఉంటే, మేము ఊరికే వదిలేస్తామా అని హెచ్చరించారువైసిపి నేతలు మాట్లాడుతున్న మాటలు తమకు చేతకాక కాదని, లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టించడం ఇష్టం లేక, ఎస్పీ తో మాట్లాడాం అన్నారు. దినేష్ విల్సన్ ను పరామర్శిస్తారని, ఎవరు ఆపుతారో చూస్తామని అన్నారు. లా అండ్ ఆర్డర్ ప్రాబ్లెమ్ రాకుండా వాళ్ళని కంట్రోల్ చేసుకోవాలని, మా నాయకుడిని మేము పరామర్శించడానికి ఆపడం సబబు కాదని తాము పరామర్శకు వస్తున్నామని, లా అండ్ ఆర్డర్ ప్రాబ్లెమ్ రాకుండా, ఎస్పీ ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు.

కావలి లో భారీ వర్షం

విశాలాంధ్ర - కావలి: పట్టణంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పెద్ద పెద్ద గాలులతో, భయానక శబ్ధాల ఉరుములు, మెరుపులతో కావలి పట్టణం దద్దరిల్లింది. వర్షం కారణంగా విద్యుత్ కు అంతరాయం కలిగింది. సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు నిరంతరాయంగా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో నిరు నిలిచింది. డ్రైనీజి కాలువలు నిండి పొంగి పొర్లాయి. ఇప్పటికే పంటను నష్టపోయిన రైతులు ఈ వర్షంతో మరింత నష్టపోయే ప్రమాదం ఏర్పడింది.

కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: తిరుమల తిరుపతి దేవస్థానానికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేసి బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ పెద్దలు చంద్రశేఖర్ రెడ్డికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మీడియా తో మాట్లాడారు. ఎమ్మెల్సీ గా కుటుంబ సభ్యులతో కలిసి వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం సంతోషం గా ఉందని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం నా టీచర్స్ నియోజక వర్గంలో ఉండటం అదృష్టం గా భావిస్తు న్నానన్నారు. శ్రీవారి ఆశీస్సులతో ప్రతి ఉపాధ్యాయుడికి మేలు జరిగేలా ప్రయత్నిస్తానని తెలిపారు.

బిజేపీ నాయకుల సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: బుచ్చిరెడ్డిపాలెం లో బిజేపీ బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ మండల కార్యవర్గ సమావేశం ఆర్ బి ఆర్ హైరర్స్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నమామీ గంగా రాష్ట్ర ప్రముఖు మిడతల రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు యాకసిరి పణిరాజు పాల్గొన్నారు. మిడతాల రమేష్ మాట్లాడుతూ బుచ్చిరెడ్డి పాలెంలో ఉన్నట కనిగిరి రిజర్వాయరు ను రైతుల సౌకర్యార్థం కోసం బ్రిటిష్ వారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తే కనిగిరి రిజర్వాయర్ కట్టను ఇప్పటి అధికార పార్టీ నాయకులు మాఫియాగా ఏర్పడి కనిగిరి రిజర్వాయర్ కట్టను ఎత్తివేస్తున్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కి ఫిర్యాదు చేసినా, బుచ్చిరెడ్డిపాలెం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన గాని అధికార పార్టీ నాయకులు స్వార్థం కోసం ఇప్పటికి గ్రావెల్‌ను తోలుతున్నారు. వెంటనే గ్రావెలు మాఫియా పై అధికారులు చర్యలు తీసుకుని గ్రావెల్ తవ్వకాలను ఆపి ఎవరైతే కట్టను తొలగించి అక్రమంగా అమ్ముకున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు యాకసిరి పణి రాజు మాట్లాడుతూభారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహిస్తున్న మనకీ బాత్100వ కార్యక్రమం ఈనెల 30 ఆదివారం జరుగుతున్న సందర్భంగా మనకి కార్యక్రమంను బూతు స్థాయిలో, శక్తి కేంద్రం స్థాయిలో నిర్వహించాలని పిలుపునిచ్చినారు. ఈకార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ మండల అధ్యక్షుడు రామిశెట్టి మోహన్ బాబు, జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చెవూరు వినయ్ నారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గోళ్ళ నరసింహులు, బుచ్చిరెడ్డిపాలెం మండల ప్రధాన కార్యదర్శి గంగపట్నం శ్రీనివాస్ తేజ, మండల ఉపాధ్యక్షులు సందల నాగేశ్వరరావు, బూదారపు రవీంద్ర, నీలం వెంకటేశ్వర్లు, గొట్టుముక్కల శ్రీనివాసులు, పాల రమేష్ శేషయ్య పాల్గొన్నారు.

నేడు జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24 వ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం జరుపుతారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామ పంచాయతీలలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించాలి. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భముగా ప్రతి సంవత్సరము ఉత్తమ ప్రతిభ చూపిన గ్రామ పంచాయతీలకు అవార్డులను మంజూరుచేస్తుంది. ఈ సంవత్సరం కూడా రాష్ట్ర జిల్లా మండల స్థాయిలో కొన్ని గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి పంచాయతీ రాజ్ దినోత్సవము రోజున 9 అంశాల నుండీ ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి సర్టిఫికెట్స్ ను మంజూరు చేయనున్నారు .దీనిలో భాగంగా రాష్ట్ర స్థాయిలో మన జిల్లా నుండీ ముత్తుకురు మండలం మల్లూరు గ్రామ పంచాయతీ ఎంపిక అయ్యింది. అదే విధంగా జిల్లా స్థాయిలో 23 గ్రామ పంచాయట్లను తొమ్మిది అంశము నుండీ ఎంపిక చేసి జిల్లా స్థాయిలో సర్టిఫికెట్స్ జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ప్రదనము చేయునున్నారు. అదేవిధంగా మండల్ స్థాయిలో కూడా ఉత్తమ పంచాయతీలకు మండల డెవలప్మెంట్ అధికారి వారి ద్వారా ఇవ్వనున్నారు: రాష్ట్ర స్థాయి పురస్కారం ముత్తుకూరు మండలం మల్లూరు పంచాయతీ కి వచ్చింది.

పుస్తకం హస్తభూషణం

- ఏప్రిల్ 23 పుస్తక పఠన దినోత్సవం సందర్భంగా
- టి వి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: పుస్తక పఠనం అనేది పెద్దలకు, పిల్లలకు ఒక మంచి అలవాటు. అంతేకాదు అది ఒక స్ఫూర్తిదాయకమైన మంచి అభిరుచి కూడా.. పుస్తకాలు చదవటం వల్ల అనేక లాభాలున్నాయి. చదవటం వల్ల కలిగే లాభాలను కొన్ని శాస్త్రీయ పరిశోధన అంశాల ద్వారా పరిశీలిద్దాం!పుస్తకాలు చదవటంవల్ల ముఖ్యంగా వత్తిడి తగ్గుతుందని అమెరికాలోని స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల బృందం కనుగొనింది. సంగీతం వినటం వల్ల 61 శాతం, ఒక కప్పు టీ తాగటం వల్ల 54 శాతం, నడవటంవల్ల 48 శాతం, వరకు వత్తిడి తగ్గుతోందని కనుగొన్నారు. అయితే పుస్తక పఠనంవల్ల పై వాటికంటే అధికంగా దాదాపు 70 శాతం వత్తిడి తగ్గుతున్నదని పరిశోధనాత్మకంగా రుజువు చేశారు. అంతేకాదు చదవటం వల్ల హృదయ స్పందన రేటు కూడా మారిందని కను గొన్నారు. అదే విశ్వవిద్యాలయం వారు పుస్తకం చదవటంవల్ల అనూహ్యంగా మెదడుకు రక్తం సరఫరా పెరిగిందని కనుగొన్నారు. యమ్ఆర్ఐద్వారా పరిశీలించి నపుడు ముఖ్యంగా సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను చదివినప్పుడు మెదడుకు రక్త ప్రసరణ ఎక్కువగా జరిగినట్లు కనుగొన్నారు. ఇంకొక అధ్యయనంలో బర్క్లీ, టొరంటో విశ్వవిద్యాలయాలలో జరిగిన పరిశోధనలలో బాగా ఎక్కువగా చదివే వాళ్ళ మెదడు చురుకుగా ఉండటం, అసలు పుస్తక పఠనం లేని వాళ్ళకంటే తెలివైన వారుగా ఉండటం గమనించారు.యేల్ విశ్వవిద్యాలయం వారు 12 సంవత్సరాల పాటు దాదాపు నాలుగు వేల మందితో ఒక అధ్యయనం చేశారు. ఈ అధ్యయనంలో పుస్తక పఠనం ఉన్న వారిలో 23 నెలల ఆయుర్దాయం పెరగటం, 20 శాతం మరణ రేటు తగ్గటం వారి అధ్యయనంలో తేలింది.

పుస్తక పఠనంవల్ల పద ఉచ్చారణ, సృజనాత్మకత, ఊహాశక్తి పెరుగుతుంది. అంతేకాదు పుస్తకాలు చదవటం వల్ల (ఇక్కడ ప్రతీ చోట పాఠ్య పుస్తకాలు కాదని గమనించుకోవాలి) కొత్త ఆలోచనలు రావటం, భాషాపరమైన నైపుణ్యాలు పెరగటం జరుగుతుంది. పుస్తక పఠనం పిల్లలకు, పెద్దలకూ అందరికీ ఒక సరదా, సంతోషాన్ని కలగజేస్తుంది. ఇది ఒక మన విలువైన సమయాన్ని వినియోగించుకునే సాధనం కూడా! చదవడమన్న ది మానవుడు కనుగొన్న అతి ముఖ్యమైన వినిమయ ప్రక్రియా అంటే అతిశయొక్తి కాదు.ప్రస్తుత కాలంలో పిల్లలకు పుస్తక పఠనం అసలు లేకుండా పోయింది. కథల పుస్తకాలు చదవటం కూడా తగ్గింది. పిల్లలు కేవలం వాళ్ళ పాఠ్యపుస్తకాలకు మాత్రమే అంకితమౌతున్నారు. పిల్లలు సెల్ ఫోనులతో ఎక్కువ సమయాన్ని గడుపుతున్నారు. మానవుడి మెదడు మూడు సంవత్సరాల నాటికే తొంభై శాతం ఎదుగుదలలో ఉంటుంది. ఆ వయసు నాటికే పిల్లలు పఠనాశక్తి కలిగి ఉంటారు, అనేక పదజాలాలను కూడా తెలుసుకొని ఉంటారు. ఈ వయసునుండే పఠనాశక్తిని పెంపొందించకపోతే తదుపరి సమయంలో పిల్లలు చదువులో కూడా వెనకబడే అవకాశం ఉంది. అందువల్ల తల్లిదండ్రులు 1-3 సంవత్సరాల లోపలే పిల్లలకు పఠనాశక్తిని కలిగించాలి. ఈ వయసు పిల్లలకు బొమ్మల కథల పుస్తకాలు పరిచయం చేయాలి. చిన్నచిన్న కథలు వినటం ద్వారా అనేక పదాలను నేర్చుకుంటారు.మీకు కావల్సినంత ధనం ఉండవచ్చు, మీ ఖజానాలో నా కంటే ఎక్కువ బంగారం ఉండవచ్చు, అయితే నాకు పుస్తకాలను చదివి పెట్టె అమ్మ మాత్రం ఉణ్ణింది." అన్నారు స్టిక్ లాండ్ గిల్లాన్ "నేనేదైనా నేర్చుకోవాలంటే అది పుస్తకాల నుంచే" అన్నారు అబ్రహమ్ లింకన్.పిల్లలకు పూస్తకాలు అందుబాటులో ఉంటే వారికి చదివే నైపుణ్యం పెరుగుతుంది. పిల్లలు ప్రతిరోజు కనీసం 30 నిమిషాలసేపు వాళ్ళ పాఠ్య పుస్తకాలు కాకుండా ఇతర పుస్తకాలను చదివేటట్లు అలవాటు చేయాలి. ఇలా చేయటంవల్ల మెదడులో వత్తిడి తగ్గి, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉంటారు. ఎక్కువగా చదవటం వల్ల ఎక్కువ విషయాలు తెలుసుకుంటావు. ఎక్కువగా నేర్చుకోవటంవల్ల అనేక ప్రదేశాలకు వెళ్లవచ్చు. డా. సూస్ చిన్న పట్టణాలలోను, గ్రామాలలోను పిల్లలు కోసం ప్రత్యేకంగా బాలల గ్రంథాలయాలు లేవు. అసలు ప్రతీ పాఠశాలలోను ఒక గ్రంథాలయం, దానిలో తగినన్ని గ్రంథాలు తప్పనిసరిగా ఉండాలి. పిల్లలు మన జాతి సంపదలు. పిల్లలు మంచి పౌరులుగా ఎదగటానికి మనం అన్ని విధాలుగా కృషిచేయాల్సిన అవసరం ఉంది. వాళ్ళకు మంచి జీవితం ఇవ్వటానికి అవసరమైన వనరులు కూడా సమకూర్చాల్సిన అవసరం మన అందరిమీద ఉంది. పుస్తకాలు చదవటం వల్ల అనేక లాభాలు ఉన్నాయి కనుక వాళ్ళకు చదివే నైపుణ్యాన్ని కలిగించాలి. పుస్తకాలు చదవటమనేది ఒక అలవాటుగా మార్చాలి. గ్రామీణ ప్రాంతాలలో బాలల గ్రంథాలయాలు స్థాపించి పిల్లలకు పుస్తకాలను అందు బాటులో ఉంచాలి. ఇక్కడ ఇంకో విషయం కూడా మనం గుర్తు పెట్టుకోవాలి. పిల్లలు తమ మాతృభాషా వాతావరణం లోనే ఎదుగుతారు. మాతృభాషలో పొందిన అనుభూతిని, ఇతర భాషలలో చదివిన పుస్తకాలలో లభించదు. కాబట్టి ప్రాథమిక స్థాయిలో పరిచయం చేసే పుస్తకాలు, కథలు ఖచ్చితంగా మాతృ భాషలోనే ఉండాలి. పుస్తకాలు చదవటంవల్ల ఒక విలువైన జీవితం లభిస్తుంది. దీనిని వేరే ఏ మార్గంలోను సాధించలేము." అన్నారు గార్డల్ హీనొల్.చిన్న పిల్లలు ఉన్న ప్రతీ ఇంట్లో పిల్లల కోసం ఒక చిన్న గ్రంథాలయ(కథలు పుస్తకాలు) తప్పక ఏర్పాటు చేసుకోవాలి. ప్రతీ గ్రామంలో పిల్లలకోసం ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి. ప్రతీ పాఠశాలలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి, అవి వినియోగం అయ్యేటట్లు విద్యాసంస్థలు చర్యలు తీసుకోవాలి. పుట్టినరోజు, ఇతర కార్యక్రమాలు నిర్వహించినపుడు పిల్లలకు బహుమతులుగా కథలు పుస్తకాలు, ఇతర పుస్తకాలు ఇచ్చే అలవాటు చేసుకోవాలి.

పెంచలకోన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన జెసి

విశాలాంధ్ర-రాపూరు: మండలంలోని పెనుశీల లక్ష్మి నరసింహస్వామి వారి 2023 వార్షిక బ్రహ్మోత్సవాలు మే నెల 1నుండి ప్రారంభం కానున్నాయి. నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ శనివారం విచ్చేసి భక్తులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలు, క్యూలైన్లు ఏర్పాట్లు, తాగునీరు, భక్తులకు భోజన సదుపా యాల, వాహనాల పార్కింగ్, రోడ్ల మరమ్మతు గురించి స్వయంగా పరిశీలన చేసి దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి జనార్ధన్ రెడ్డితో రాపూరు సిఐ కోటేశ్వరావు, ఎస్ఐ క్రాంతికుమార్, విద్యుత్ శాఖ, ఇతర శాఖల వారికి తగు సూచనలు జారీ చేశారు.

గ్రూప్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: భారత ప్రభుత్వంలోని వివిధ విభాగాలు, సంస్థలు వివిధ రాజ్యాంగ సంస్థలు, చట్టబద్ధమైన సంస్థలు, ట్రిబ్యునల్స్‌లో వివిధ గ్రూప్-బి గ్రూప్-సి పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్-2023 కోసం ఈ నెల 3వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేశారని కలెక్టర్ యం. హరినారాయణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఈ రిక్రూట్‌మెంట్ కు సంబంధించిన పోస్టుల వివరాలు, వయోపరిమితి, అవసరమైన విద్యార్హత, చెల్లించాల్సిన ఫీజు, పరీక్ష విధానం, ఎలా దరఖాస్తు చేయాలి మొదలైన వివరాలకు సంబంధించిన పూర్తి సమాచారం ఎస్ఎస్‌సి.ఎన్ఐసి.ఇన్ వెబ్ సైట్‌లో వివరంగా ఇచ్చారని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తును ఆన్‌లైన్ మోడ్‌లో మాత్రమే ద్వారా సమర్పించాల్సి వుంటుందని, దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 3-5-2023, ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు చేయడానికి తేదీ 4-5-2023 చివరి తేదీ అని కలెక్టర్ తెలిపారు. ఈ పరీక్ష కంప్యూటర్ ఆధారితంగా నిర్వహిస్తామన్నారు. సౌత్ రీజియన్ పరిధిలో మొత్తం 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 10 కేంద్రాలు, పుదుచ్చేరిలో 1 కేంద్రం, తమిళనాడులో 7 కేంద్రాలు, తెలంగాణలో 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారని కలెక్టర్ తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పేదలకు ఇళ్లు ఇవ్వాలని అడిగితే అరెస్టులా ?

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:నెల్లూరు జిల్లాలో సీపీఎం ఆధ్వర్యంలో కల్లూరు పల్లిలో పేదలు వేసుకున్న గుడిసెలు, ప్రభుత్వం నెల్లూరు ఆర్డీవో పర్యవేక్షణలో జిల్లా పోలీస్ యంత్రాంగం అంతా అక్కడ చేరి జె.సి.బి లతో ఈ రోజు తెల్లవారు జామునుంచి అక్కడ పేదలు వేసుకున్న గుడిసెలను కూల తోయడమే

కాక అక్కడ అడ్డుకున్న వామపక్ష కార్యకర్తలను అరెస్టు చేయడంతో పాటు ఈ చర్యలను అడ్డుకుంటారే మోనని జిల్లా లో సీపీఎం నాయకులను పలు చోట్ల అరెస్టులు చేశారు. అందులో భాగంగా సీపీఐకి చెందిన జిల్లా కార్యవర్గ సభ్యులైన ప్రముఖ న్యాయ వాది సీపీఐ నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులు అరిగెల నాగేంద్రసాయిను కూడా తెల్లవారు నుంచి మాగుంట లే అవుట్ లో వారి ఇంటి ముందు పోలీసుల పహారా తో హౌస్ అరెస్టు చేశారు. కల్లూరుపల్లి భూ పోరాటం చేస్తున్న సిపిఎం నాయకుల్ని ముందస్తు అరెస్టు చేశారు. అందులో భాగంగానే ఆ భూ పోరాటం సీపీఐ కూడా భాగస్వామ్యం ఉందని పోలీసులు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్ ను ఉదయం 6 గంటల నుండి హౌస్ అరెస్ట్ చేసి ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నియంత పాలన నిదర్శనం ఇది అని సయ్యద్ సిరాజ్ (సీపీఐ) అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై పోరాడుతున్నట్టు వామపక్ష నాయకులను అరెస్టు చేయటానికి ముఖ్యంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులను అరెస్టు చేయడాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి దామ అంకయ్య ఈ చర్యలను తీవ్రంగా ఖండించారు.

మనుబోలులో 'మా నమ్మకం నువ్వే జగన్'

విశాలాంధ్ర- మనుబోలు:రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు సర్వేపల్లి నియోజక వర్గం లోని మనుబోలు మండలం మనుబోలు గ్రామ పంచాయతీ పరిధి లోని ఏరుకుల కాలనీలో ఆదివారం 'మా భవిష్యత్తు నువ్వే మా నమ్మకం నువ్వే జగన్..' అనే కార్యక్రమాన్ని రాష్ట్ర నెట్ కాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్ గౌడ్ సచివాలయ కన్వీనర్ దువ్వూరు సుధాకర్ రెడ్డి, దాసరి మహేంద్ర వర్మ ఆధ్వర్యంలో వాలంటీర్లు గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ పాంప్లెట్ స్టిక్కర్ తీసుకుని జగనన్న ద్వారా లబ్ది పొందుతున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి తెలియజేస్తూ వారి ద్వారా 'మా జీవితాంతం మా భవిష్యత్తు నువ్వే జగన్ ' అంటూ తెలుపుతున్నారు. వాలంటీర్లు, ఇండ్ల స్వాతి, వెంకటరమణ, గృహ సారధులు లక్ష్మి , దాసరి అశోక్, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాలిస్ నెల్లూరు చాప్టర్ ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: సొసైటీ ఫర్ది అడ్వాన్సుమెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ నెల్లూరు చాప్టర్ ఆర్ఆర్ఆర్ అండ్ వివిఎస్ గవర్నమెంట్ కళాశాల, విడవలూరు వారు కలసి ప్రపంచ పుస్తక దినోత్సవం, ఏప్రిల్ -23 సందర్భగా సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, సుబేదార్ పేట, నెల్లూరులో విద్యార్థులకు పుస్తక పఠనం పట్ల అవగాహన, ఆవశ్యకత కలిగించేందుకు కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పుస్తక పఠన ప్రతిజ్ఞ, పుస్తక పఠనం లాభాలను వక్తల ద్వారా వివరించారు. రీడింగ్ సర్కిల్స్ ను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులలో పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించవచ్చునని తెలిపారు. నెల్లూరు చాప్టర్ చైర్మన్ మాట్లాడుతూ మంచి పుస్తకం విజ్ఞానాన్ని ఇవ్వడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మంచి పుస్తకం మనకు మంచి మార్గ నిర్దేశాన్ని చూపిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలిస్ నెల్లూరు చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఈ. కిరణ్ కుమార్, సెక్రటరీ డాక్టర్ పి. విజయ మహేష్, కోశాధికారి మస్తానయ్య, కమిటీ అడ్వైజర్స్ డాక్టర్. ఎన్. ప్రభాకర్, డాక్టర్ ఓ శేషయ్య, ఇతర సభ్యులు, పుస్తక పఠనం ఆవశ్యకతను విద్యార్థులతో, గ్రంథ పాలకు లుగా తమ అనుభ వాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎంతో సహకారం అందించిన హాస్టల్ వార్డెన్ ఈదూరి విజయకుమార్ హాస్టల్ సిబ్బందికి కమిటీ ధన్యవాదాలు తెలిపారు.

మల్లూరు సచివాలయానికి మూడు అవార్డులు

విశాలాంధ్ర-ముత్తుకూరు: మండలంలోని మల్లూరు సచివాలయం పరిధిలోని మల్లూరు గ్రామ పంచాయతీకి రాష్ట్ర స్థాయి అవార్డు, ఇదే సచివాలయం పరిధి లోని దువ్వూరు వారి పాలెం, పాటూరు వారి కండ్రిగ పంచా యతీలకు జిల్లా స్థాయి అవార్డులు

దక్కాయి. ఆదివారం పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు ఆయా పంచాయతీలకు ఆయా శాఖ నుండిఆదేశాలు అందినట్టు ఎండిఓ ప్రత్యూష తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మాత్యులు కాకాని గోవర్ధన్ రెడ్డి సహకారంతో పై పంచాయతీలు ఈ అవార్డులను దక్కించుకున్నా యన్నారు. మల్లూరు కు పేదరికం లేని జీవన ప్రమాణాలు మెరుగు పరచబడిన పంచాయితీగా రాష్ట్రస్థాయి అవార్డు దక్కిందన్నారు. దువ్వూరు వారి పాలెం పంచాయితీకి వుమన్ ఫ్రెండ్లీ అవార్డు దక్కిందని అంటే మహిళ సన్నిహిత, మహిళలకు రక్షణగా, మహిళలు ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉండే పంచాయితీ గుర్తింపు రావడంతో ఈ అవార్డు దక్కిందన్నారు. అలాగే పాటూరు వారి కండ్రిగ పంచాయతీకి జిల్లా స్థాయి సోషల్ సెక్యూరిటీ పంచాయతీగా అవార్డు వచ్చిందన్నారు. అంటే సామాజిక భద్రత గల పంచాయతీ అని ఆమె తెలిపారు. అవార్డులకు ఎంపికైన గ్రామ సర్పంచులు ఈనెల 24వ తేదీన మల్లూరు పంచాయతీ సర్పంచ్ దువ్వూరు విజయకుమార్ రెడ్డి అవార్డు కోసం అమరావతికి వెళ్లాల్సి ఉంటుందని, జిల్లా స్థాయిలో అవార్డుకి ఎంపికైన పాటూరు వారి కండ్రిగ సర్పంచ్ మాచిరెడ్డి రాజా రామిరెడ్డి, దువ్వూరు వారి పాలెం సర్పంచ్ అన్నాబత్తిన కృష్ణవేణి నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగే అవార్డుల ప్రదాన ఉత్సవానికి హాజరు కావాల్సి వున్నట్లు తెలిసింది.

వెంకటేశ్వర జనార్దన్ రెడ్డి కాలనీలో ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: 54 డివిజన్ వెంకటేశ్వర జనార్దన్ రెడ్డి కాలనీలో ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ మున్న డిమాండు చేశారు. సిపిఐ కార్యా లయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వ ర జనార్దన్ రెడ్డి కాలనీ 54 డివిజన్ 2 టౌన్ పరిధిలో ఉందని, ఇక్కడ స్థానికులు భయభ్రాంతికి గురి అవుతున్నారని, ఇక్కడ ప్రతి ఒక్కరూ ఆటో ఎక్కడానికి కూడా భయపడే విధంగా రౌడీ షీటర్లతో గంజాయి, సొల్యూషన్ వంటి మత్తు పదార్థాలు సేవించి యువత చెడు వ్యసనాలకి పాల్పడుతున్నారన్నారు. పదేళ్ల పిల్లోడితో సహా సొల్యూషన్ గంజాయి తాగేసి ఏ చిన్న గొడవ వచ్చినా కత్తులు తీసుకొని పొడుచుకునే విధంగా తయారయ్యారన్నారు. ఆటోలో వెళ్లే మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరి స్తున్నారని, అరాచకాలు చేస్తున్నారని, కొత్తగా ఏర్పాటు చేసిన టిడ్కో గృహాలు బయటనుంచి బాడుగలు తీసుకొని అక్కడ గంజాయి సొల్యూషన్ అమ్మకాలు చేస్తున్నారన్నారు. దీనిపై గతంలో ఎస్పీని కలిసి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తే టూ టౌన్ సిఐని కలవాలని ఆయన చెప్పారన్నారు. సిఐని కలిసినా ఆయన ఇంత వరకు ఎలాంటి చెక్‌పోస్టులు పెట్టిన దాఖలాలు లేవన్నారు. కానీ అది నేటి వరకు ఆచరణలో జరగలేదని, ఎస్పీ స్పందించి వెంకటేశ్వర జనార్దన్ రెడ్డి కాలనీ భగత్ సింగ్ కాలనీ టిడ్కో గృహాలు ఇస్లాంపేట, అలీ నగర్, రైల్వే వీధి, వెంకటేశ్వర పరిధిలో అవుట్ పోలీస్ స్టేషన్ పెట్టాలని కోరుతున్నామన్నారు. ఒక ఔట్ పోస్ట్ పోలిస్ స్టేషన్ అక్కడ ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతంలో గొడవలు సర్దుమణిగి ప్రశాంతమైన వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుందని, జిల్లా ఎస్పీ తక్షణం ఈ విషయం పరిశీలించి అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ డిమాండు చేస్తోందని మున్న తెలిపారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు సర్దార్, సుల్తాన్, కరిముల్లా పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలను ఓర్చుకోలేకపోతున్న వైసిపి నేతలు: టిడిపి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: వెంకటాచలంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు మామిళ్ళ పల్లి శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ టీడీపీలో చేరిక లను వైసీపీ నేతలు ఓర్చుకోలేక పోతున్నారని, చవటపాళెం పంచాయతీలోని ఎర్రగుంటకు చెందిన యువత తమ స్నేహితులతో కలిసి టీడీపీలో చేరడాన్ని వైసీపీ నేతలు జీర్ణించు కోలేక పోతున్నారన్నారు. వైసీపీ నేతల అరాచకాలు, అక్రమాలతో ప్రజలు విసిగివేసారి పోయారని, రోజురోజుకూ గ్రాఫ్ పడిపోతుం డటంతో తన అనుచరులతో నోటి కొచ్చినట్టు దుర్భాషలాడడం సరికాదన్నారు. సోమిరెడ్డి దగ్గర టిప్పులు తీసుకున్న వాళ్లే సవాళ్లు విసరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గెలిచినా, ఓడినా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడే నాయకుడు సోమిరెడ్డి అని తెలిపారు. ఇటీవల టీడీపీలో చేరిన వాళ్లు ఏ నియోజకవర్గం ఓటర్లో నిరూపించడానికి వారే సిద్ధంగా ఉన్నారు. మీరు సిద్ధమా?' అని సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల గుర్తింపు 3సంవత్సరాలు నుండి 8 సంవత్సరాలకు పెంపు

విశాలాంధ్ర-రాపూరు: ప్రైవేటు పాఠశాల గుర్తింపును 3 సంవత్సరాల నుండి 8 సంవత్స రాలకు పెంచారని రాపూరు లోని అపుస్మా రాపూరు సర్కిల్ అధ్యక్షులు జెమ్స్ పాఠశాల కరస్పాండెంట్ బులగాకుల మునీంద్రా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గత మాసంలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఇచ్చి న మాట ప్రకారం ఎనిమిది సంవ త్సరాల పొడిగింపునకు కృషిచేసి సాధించినందుకు గాను తూర్పు రాయలసీమ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అపుస్మా రాష్ట్ర అధ్యక్షులు రామ చంద్రారెడ్డికి, అపుస్మా రాష్ట్ర సీని యర్ ఉపాధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి కి, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అనే స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ఆపుస్మ) రాపూరు సర్కిల్ తరపున అపుస్మా రాపూరు సర్కిల్ అధ్యక్షులు గా ప్రత్యేక కృతజ్ఞత అభినందన లు తెలిపా మని అపుస్మా సర్కిల్ అధ్యక్షులు బులగాకుల మునీంద్రారెడ్డి తెలిపారు.

ఐదవ తరగతికి 313.. ఇంటర్మీడియట్ కు 212..

విశాలాంధ్ర-ముత్తుకూరు: ముత్తుకూరు లోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ల్లో ఐదవ తరగతి ప్రవేశం కోసం ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్షకు ముత్తుకూరు గురుకు ల పాఠశాలకు సంబం ధించి 359 మంది విద్యార్థులు దరఖాస్తు చేసు కోగా, 313 మంది పరీక్షకు హాజరయ్యారని, ఇంటర్మీడియట్లో చేరేందుకు జరిగిన ప్రవేశ పరీక్షకు 262 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 212 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యా రని బాలికల గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

విశాలాంధ్ర -ఉదయగిరి: నియోజకవర్గం పరిధిలోని వింజమూరులో కాకర్ల ఆ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ ఆదివారం ప్రారంభించారు. ఉదయగిరి ఆత్మకూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకట రామారావు కొమ్మి లక్ష్మయ్య నాయుడు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ అన్న క్యాంటీన్ ప్రారంభించారు . అనంతరం విఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఏర్పాటు చేసిన సమావేశంలో బొల్లినేని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. విరివిగా ప్రచారం చేసి టిడిపి గెలుపునకు కృషి చేయాలని అన్నారు టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు జగన్ తూట్లు పొడిచారని అన్నారు. పేదలకు కడుపునిండా రూ.5 కు అన్నం పెట్టే అన్న క్యాంటీన్ కూల్చి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పైశాచిక ఆనందం పొందాలని విమర్శించారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలు వైయస్సార్ ప్రభుత్వాన్ని తరిమి కొడతారన్నారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మణుడు మాట్లాడుతూ యువతులు సేవ దృక్పథం పెరగాలని అన్నారు . ఈ సందర్భంగా కాకర్ల సురేష్‌ను అభినందించారు. కాకర్ల చారిటబుల్ అధినేత కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో ఏదైనా అభివృద్ధి జరిగి ఉంటే టిడిపి హయాంలోనే జరిగిందని అన్నారు నిరుపేదల కడుపు నింపేందుకు రూ 5 తమ ట్రస్టు ద్వారా అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో అన్న కాంటీన్లు మరింతగా విస్తరిస్తామన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్ఫూర్తితో సంజీవని ఆరోగ్య రథం రథంను ఈనెల 27 నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ రథంలో డాక్టర్ హెల్పర్స్ తోపాటు ల్యాబ్ టెక్నీషియన్ ఇద్దరు సహాయకులు ఉంటారన్నారు. ఉచితంగా రక్త పరీక్షలు ఈసీజీని నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు వారికి పలు రంగాలలో శిక్షణ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు ప్రజలు తమను ఎంతగానో అభిమానిని అభిమానించినందుకు వారికి కృతజ్ఞతలు తెలుపు కుంటు న్నామన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలను చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ శాలువా గజమాలలతో ఘనంగా సన్మానిం చారు. కాకర్ల సురేష్‌ను టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు శాలువా గజ మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, లీగల్ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చంచల బాబు యాదవ్, వింజమూరు మండల కన్వీనర్ రఘురామిరెడ్డి, 8 మండలాల కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇస్లాం పేటలో ప్రచార భేరి

విశాలాంధ్ర - కావలి: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు లో భాగంగా ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ఇస్లాం పేట, కొత్త మసీదు, సపోటా తోట ప్రాంతాలలో కార్యకర్తలు కరపత్రాలు పంచుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలతో కేంద్రంలో పరిపాలిస్తున్న బిజెపి పార్టీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను బడా పారిశ్రామిక వ్యక్తులకు కట్టబెడుతూ, పారిశ్రామిక వ్యక్తులకుఅంబాని, ఆదానీ లకు లాభాలు చేకూరుస్తూ ప్రజలపై భారాలు మోపుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించాలన్నారు. అలాగే మన రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ విధానాలను అమలు చేస్తూ, మూడు రాజధానులు అంటూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎస్కే అమీర్ భాష, ఎస్కే మహబ్ బాషా, ఎస్కే మస్తాన్, డివైఎఫ్ఐ నాయకులు ఎస్కే నాయబ్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - కావలి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో ఆదివారం రెడ్ క్రాస్ జీవిత సభ్యులు, హెూంగార్డ్స్ అసోసి యేషన్ నాయకులు మద్దెల శ్రావణ్ కుమా ర్ (బాబీ) సహ కారంతో మజ్జిగ పంపి ణీ చేశారు. ఈ కార్యక్ర మంలో రెడ్ క్రాస్ జిల్లా ఇంచార్జి చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు, సభ్యులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నందనవనం సీతాలక్ష్మి, దాకారపు వెంకట పద్మావతి, డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కె.వి.ఆర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ నాయుడు మాట్లాడుతూ వేసవికాల విపత్తుల నివారణ చర్యలలో భాగంగా ప్రయాణికుల కొరకు చలివేంద్రాలు ఏర్పాటుచేసి మంచినీరు అందించడంతో పాటు మిట్ట మధ్యాహ్న సమయంలో దాతల సహకారంతో మజ్జిగ పాకెట్లు కూడా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.

14వ డివిజన్‌లో వీధి వీధికి మీ కర్తం

విశాలాంధ్ర - నెల్లూరు: సిటీ శాసన సభ్యులు, అనిల్ కుమార్ యాదవ్ సూచన పై 14వ డివిజన్‌లో ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కార్పొరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డి 'ఉషోదయాన వీధి వీధికి మీ కర్తం' అనే నూతన కార్యక్రమా నికి ఈ రోజు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా డివిజన్ లోని ఏసీ నగర్, బాలాజీ నగర్ లలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలువల్లో చెత్త పేరుకు పోయి, మురుగు నీటి పారుదల కు ఆటంకం కలుగుతోందని స్థానికులు చెప్పడం తో కర్తం స్పందించి శానిటరీ మేస్త్రీలను పిలిపించి కాలువల్లో పేరుకు పోయిన చెత్తను తొలగిం చాలని, రోడ్లను శుభ్రం చేయాలని సూచించారు. ఎక్కడా మురుగునీరు నిలువకుండా చూడాలని, చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏ సమస్య ఉన్నా తనకు తెలిపితే పరిష్కరిస్తామన్నారు.

నేటి నుంచి శంకర జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: శ్రీ పినాకినీ విద్యా పీఠం ఆధ్వర్యంలో నెల్లూరు ట్రంక్ రోడ్ లో తిప్పరాజు వేంకట సుబ్బయ్య కళ్యాణ సదన్‌లో మంగళవారం నుంచి అయిదు రోజుల పాటు వైశాఖ శుద్ధ పంచమి నుండి నవమి వరకు జగద్గురు ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శంకర భగవత్పాదుల వారికి పుష్పార్చనలు తీర్థప్రసాదాల వితరణ చేయనున్నారు. సాయంత్రం 6-30 గంటల నుండి ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తారు. 25, 26, 27వ తేదీలలో విజయవాడకు చెందిన మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి సౌందర్య లహరి, 28వతేదీ నంద్యాల వాస్తవ్యులు దీవి హయగ్రీవ ఆచార్యులు శివానందలహరి, 29వ తేదీ ఒంగోలు వాస్తవ్యులు ములుకుట్ల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ విష్ణు షట్పది స్తోత్రంపై ప్రవచనాలు చేయనున్నారు. అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని అధ్యక్షులు స్వయం పాకుల శ్రీనివాసులు, కార్యదర్శి చక్రాల వెంకట లక్ష్మీ నరసింహం కోరారు.

నీతి లేని సోమిరెడ్డి: మాజీ జడ్‌పిటిసి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: వెంకటాచలం మండలం, వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వైసీపీ అధికార ప్రతినిధి, మాజీ జెడ్పిటిసి మందల వెంకటశేషయ్య యాదవ్ మాట్లాడుతూ సోమిరెడ్డి ఇకనైనా డ్రామాలు ఆపితే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. సోమిరెడ్డి లాంటి దొంగ, దోపిడీదారుడు, అవినీతిపరుడు, ఇంకొక్కడు ఉండరన్నారు. బయట నియోజకవర్గం నుండి కూలీకి జనాన్ని తీసుకొని వచ్చి, టిడిపిలో చేరారని ప్రకటించుకునేలా దిగజారి పోయాడన్నారు. సోమిరెడ్డి విచ్చలవిడి అవినీతితో సర్వేపల్లి నియోజకవర్గాన్ని అధోగతిపాలు చేస్తే, అధికార పార్టీ శాసనసభ్యుడిగా, మంత్రిగా కాకాణి సర్వేపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చారంటూ ప్రజలు చర్చించుకోవడం వాస్తవం. పంచభూతాలను దోపిడీ చేసి, ఇతరుల ఆస్తులను అమ్మి, దొంగ రిజిస్ట్రేషన్లు చేసి, సొమ్ము చేసుకునే సోమిరెడ్డి లాంటి ద్రోహులు రాజకీయాల్లో వెతికినా కనిపించరు. సోమిరెడ్డి నెల్లూరు జిల్లాకు మాయని మచ్చ అన్నారు. విలక్షణమైన రాజకీయ లక్షణాలు కలిగిన నాయకుడు కాదు. కండువాలు కప్పిన వారి ఫోటోలు, వారి అడ్రస్సులు, వారికి ఓట్లు సర్వేపల్లి నియోజకవర్గంలో ఉన్నట్లు రుజువు చేస్తే, నేను రాజకీయాల నుండి శాశ్వతంగా తప్పుకుంటానని సవాలు విసిరానా సవా ల్ ను స్వీకరించే శక్తి లేక, నేల టికెట్ గాళ్ల ద్వారా విమర్శలు చేయిస్తున్నాడు. దమ్ము, ధైర్యం ఉంటే నా సవాల్ ను స్వీకరించి, సోమి రెడ్డి ప్రకటిం చిన విధంగా టిడిపిలో చేరిన వారం దరూ సర్వేపల్లి నియోజక వర్గం ఓటర్లను రుజువు చేయాలి. చేతకాక పోతే టికెట్ సాధించు కోవడం కోసం చంద్రబాబు ప్రాపకం కోసం నానా గడ్డి కరుస్తున్నాడు. టికెట్ సాధించు కోవడంపై ఉన్న ధ్యాస గెలుపుపై లేదు టికెట్ సంపాదించుకోవడం, చందాలు దండుకోవడం, డబ్బులు మిగిలిచ్చుకోవడం, మిగిల్చుకున్న డబ్బుతో దర్జాగా బతకడం అలవాటు. నాలుగు సార్లు మట్టి కరిపించిన సర్వేపల్లి ప్రజలు, సోమిరెడ్డి ఏడ్చినా, కాళ్ళు పట్టుకున్నా, టికెట్ తెచ్చుకుంటే మరోసారి మట్టి కరిపించేం దుకు సిద్ధంగా ఉన్నారు. టిడిపి తరపున సర్వేపల్లిలో పోటీ చేస్తే, టిడిపి ఇతర పార్టీలతో పొత్తులతో కలిపి పోటీ చేసినా174 స్థానాల్లో పోటీచేసినట్లు భావించా లన్నారు. సోమిరెడ్డి లాంటి విలువలు లేని వారిపై ఎవరు పోటీ చేసినా, గెలవడం అతి సులభం అన్నారు. చందాల సోమిరెడ్డి, త్వరగా టిడిపి టికెట్ సంపాదించుకొని, చందాల వసూళ్లకు పూనుకుంటే మాకు అభ్యంతరం లేదు కానీ, జిమ్మిక్కులు చేస్తే మాత్రం ఊరుకోము. చేతనైతే ఇప్పటికైనా నా సవాల్ ను స్వీకరించాలన్నారు.